ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు
ఆదివారం 7 జూలై 2024



రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(కలెక్టరేట్), జూలై 6: కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ పి.రంజిత్‌బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



కర్నూలులోని క్లస్టర్ యూనివర్సిటీ

క్లస్టర్ వర్సిటీపై కక్ష..!

- మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన అరాచకం
- రిజిస్ట్రార్ సంతకం ఫోర్జరీ.. రూ.46 కోట్లు మళ్లింపు
- ప్రశ్నించినందుకు వీసీకి బెదిరింపులు
- ఏడాదిగా బడ్జెట్, జీతాలివ్వకుండా వేధింపులు
- రిజిస్ట్రార్ శ్రీనివాసులు డిప్యుటేషన్‌ను రద్దు చేసి ఎస్వీ వర్సిటీకి రీకాల్ చేయాలని హుకుం
- సీఐడీ విచారణ కోరుతూ సీఎంకు వీసీ లేఖ

కర్నూలు(అర్బన్), జూలై 6: కర్నూలు క్లస్టర్ యూనివర్సిటీపై మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి కక్ష సాధింపులకు పాల్పడ్డారు. వర్సిటీ వ్యవహారాల్లో నిత్యం తలదూర్చడంతోపాటు ఆయన చేసిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. కర్నూలు నగర శివారులోని జగన్నాథ గట్టుపై 50 ఎకరాల్లో వర్సిటీ భవనాల నిర్మాణం కోసం 2021లో కేంద్రం రూ.80.50 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులు మంత్రి తనకు అనుకూలమైన కాంట్రాక్టర్‌కు కట్టబెట్టారు. అయితే బుగ్గననే కాంట్రాక్టర్‌గా మారి బినామీ పేరుతో పనులు నిర్వహిస్తున్నారని అప్పట్లో దుమారం రేగింది. పనులు సక్రమంగా చేయకపోగా ఇష్టారీతిన వ్యవహరించారన్న విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలోనే 2023లో నిర్మాణాలకు సంబంధించి రూ.46 కోట్ల బిల్లులను వర్సిటీ రిజిస్ట్రార్ శ్రీనివాసులు సంతకాన్ని ఫోర్జరీ చేసి కాంట్రాక్టర్ ఖాతాలోకి మళ్లించారు. దీనికి సంబంధించి ఎం.బుక్, రికార్డ్స్‌లో సంతకాలు పెట్టాలని ఏపీఈడబ్ల్యూఐడీసీ (ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) అధికారులు ఒత్తిడి తెచ్చినట్టు తెలిసింది. ఇందుకు వీసీ ససేమిరా అనడంతో పాటు నిర్మాణాల్లో జరుగుతున్న అక్రమాలపై అప్పటి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. దీనిపై బుగ్గనతో మాట్లాడిన బొత్స, విషయాన్ని నాటి సీఎస్ జవహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.

ఉపకులపతిపై రుసరుసలు!

వర్సిటీ నిర్మాణాల్లో జరుగుతున్న అక్రమాలను బొత్స దృష్టికి తీసుకెళ్లడాన్ని జీర్ణించుకోలేని బుగ్గన.. 'నాపైనే ఫిర్యాదు చేస్తావా..' అంటూ వీసీ సాయిగోపాల్‌పై రుసరుసలాడటంతో పాటు బెదిరింపులకు సైతం దిగినట్టు సమాచారం. అలాగే రిజిస్ట్రార్ శ్రీనివాసులు డిప్యుటేషన్‌ను రద్దు చేసి, ఎస్వీ వర్సిటీకి రీకాల్ చేయాలని ఆదేశించారు. మరోవైపు విద్యార్థి సంఘాలతో రిజిస్ట్రార్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు చేయించారు. అయితే రిజిస్ట్రార్ డిప్యుటేషన్ రద్దుకు వీసీ అంగీకరించకపోవడంతో ఏడాదిగా వర్సిటీకి బడ్జెట్‌తో పాటు జీతాలు కూడా నిలిపివేయించారు. అప్పటి విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్యామలరావు, సీఎస్ కూడా ఈ విషయంలో దోబూచులాడారు. ట్రెజరీకి ఐదు నెలల జీతాన్ని సిఫారసు చేస్తూనే దానిపై బుగ్గనకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన కర్నూలు ట్రెజరీలో ఉపకులపతి అకౌంట్‌కు జీతం బదిలీ అయ్యే సమయానికి వాటిని నిలిపివేయించారు. నేటి వరకూ జీతాలు అందని పరిస్థితి నెలకొంది.

పోస్టుల భర్తీకి 'పోలా' మోకాలడ్డు

క్లస్టర్ వర్సిటీకి సంబంధించి బోధన, బోధనేతర పోస్టులు మంజూరైనా నేటికీ భర్తీ కాలేదు. ఇందుకు ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్ అడ్డుతగులుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వీసీ తనకు అనుకూలంగా వ్యవహరించరనే ఉద్దేశంతోనే పోస్టుల భర్తీకి కమిషనర్ అనుమతి ఇవ్వలేదని తెలుస్తోంది. వీసీని ఇబ్బందులకు గురిచేసి దారికి తెచ్చుకోవడంలో భాగంగా అనేక సమస్యలు సృష్టించినట్టు సమాచారం. ఇందులో భాగంగానే వర్సిటీకి అనుసంధానం కావాల్సిన కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల, సిల్వర్ జూబ్లీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, వీసీ మధ్య నిత్యం వివాదాలు సృష్టించారన్న విమర్శలు ఉన్నాయి. అంతేగాకుండా ఆయా కళాశాలల్లో బదిలీలు, అంతర్గత బదిలీలు, పాలనా వ్యవహారాల్లో అన్ని తానై నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. 2021 నుంచి పోస్టులు భర్తీ చేయకపోవడంతో కేవలం వీసీ, రిజిస్ట్రార్‌లే మిగిలారు. అటెండర్, ఇతర విధులకు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లను బతిమాలి డిపుటేషన్‌పై తెచ్చుకున్న ఉద్యోగులతో నెట్టుకొస్తున్నారు.



సీఎంకు లేఖ రాశా

క్లస్టర్ యూనివర్సిటీకి సంబంధించి జరుగుతున్న అక్రమాలపై సీటీసీఐడీ, సీఐడీ దర్యాప్తునకు ఆదేశించాలని సీఎం, సీఎస్‌కు లేఖ రాశాను. రిజిస్ట్రార్ సంతకం ఫోర్జరీ చేసి కళాశాల నిర్మాణాలకు సంబంధించిన రూ.46కోట్లు కాజేశారు. ప్రశ్నించినందుకు గత ఏడాదిగా జీతాలు ఇవ్వకుండా వేధిస్తూ వచ్చారు. అప్పటి ఆర్థికమంత్రి బుగ్గన నాకు నేరుగా ఫోన్ చేసి బెదిరించారు. ఇదే విషయాన్ని అప్పటి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదు. దీనికితోడు వర్సిటీకి బడ్జెట్ కూడా కేటాయించకుండా నిలిపివేశారు.

- ప్రొఫెసర్ డాక్టర్ సాయిగోపాల్, వీసీ, క్లస్టర్ యూనివర్సిటీ, కర్నూలు

చంద్రబాబు నమ్మకాన్ని ప్రజలు నిలబెట్టారు

- ఎన్నడూలేని విధంగా అభివృద్ధి చేసి చూపుతా
- ప్రమాణ స్వీకారం తర్వాత జిల్లాకు ఎంపీ బస్తిపాటి నాగరాజు



జిల్లాకు చేరుకున్న ఎంపీ బస్తిపాటి

కర్నూలు(అర్బన్), జూలై 6: జిల్లాలో ఎన్నడూ లేని అభివృద్ధిని చేసి చూపుతానని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. శనివారం ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసి మొదటిసారి జిల్లాకు వచ్చిన నాగరాజుకు భారీ స్వాగతం లభించింది. నగర శివారులోని అలంపూర్ టోల్ ప్లాజా వద్ద టీడీపీ, జనసేన శ్రేణులు, అభిమానులు పెద్దఎత్తున స్వాగతం పలికారు. అనంతరం టోల్ ప్లాజా నుంచి ఎంపీ సొంత గ్రామమైన పంచలింగాల గ్రామం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు మాట్లాడుతూ సాధారణ ఎంపీటీసీగా ఉన్న తనపై నమ్మకం ఉంచి చంద్రబాబు ఎంపీ టికెట్ ఇచ్చారని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా తెలుగుదేశం ప్రభుత్వం పాలన సాగిస్తోందని, జిల్లాలో నీటి ప్రాజెక్టులు నిర్మించి కరువు, వలసలను నివారించడంతోపాటు తాగు నీటి సమస్య లేకుండా చేస్తామని భరోసా ఇచ్చారు. పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ కర్నూలు, కోడుమూరు ఇన్‌చార్జి హర్షద్, రాంబాబు, టీడీపీ కార్పొరేటర్ పరమేష్, పంచలింగాల గ్రామ సర్పంచ్ కృష్ణ యాదవ్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కురువ సంఘం నాయకులు, పంచలింగాల గ్రామస్తులు పాల్గొన్నారు,

గుంతకల్లు డీఆర్ఎంకు రిమాండ్

మరో ఆరుగురికి కూడా..





ఏసీబీ కోర్టు నుంచి బయటకు వస్తున్న రైల్వే అధికారులు

కర్నూలు(లీగల్), జూలై 6: గుంతకల్లు రైల్వేస్ డివిజనల్ మేనేజర్ (డీఆర్ఎం)తోపాటు మరో ఆరుగురికి కర్నూలు సీబీఐ కోర్టు 14 రోజులపాటు రిమాండ్ విధించింది. రైల్వే కాంట్రాక్టు పనుల మంజూరులో అవినీతికి పాల్పడుతున్నారంటూ శుక్రవారం వీరు అరెస్టయ్యారు. ఈ మేరకు గుంతకల్లు డివిజనల్ రైల్వే మేనేజర్ వినీత్‌సింగ్, సీనియర్ డివిజనల్ ఫైనాన్స్ మేనేజర్ కుండా ప్రదీప్‌బాబు, సీనియర్ డివిజనల్ ఇంజనీర్ యు.అక్కిరెడ్డితోపాటు మరో నలుగురికి 14 రోజులపాటు రిమాండ్‌కు ఆదేశిస్తూ కర్నూలు సీబీఐ కోర్టు ఇన్‌చార్జి న్యాయాధికారి పి.పాండురంగారెడ్డి శనివారం ఆదేశాలు జారీ చేశారు. రైల్వే టెండర్ల విషయంలో ఐదుగురు అధికారులు కాంట్రాక్టర్లకు అనుకూలంగా వ్యవహరిస్తూ వారి వద్ద నుంచి విలువైన బహుమతులు తీసుకుంటున్నట్లు సీబీఐ అధికారులకు సమాచారం అందడంతో వారు గత కొన్ని రోజులుగా వీరిపై నిఘా ఉంచారు. శుక్రవారం పక్కా సమాచారం అందడంతో సీబీఐ డీఎస్పీ జయకుమార్ భారతీయ ఆధ్వర్యంలో సీబీఐ అధికారులు గుంతకల్లులోని డీఆర్ఎం కార్యాలయాన్ని తనిఖీ చేసి దాదాపు రూ.11 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత రైల్వే అధికారులైన డీఆర్ఎం వినీత్ సింగ్, సీనియర్ డీఎస్ఎం కుండా ప్రదీప్‌బాబు, సీనియర్ డివిజనల్ ఇంజనీర్ యు.అక్కిరెడ్డి ఆఫీసు సూపరింటెండెంట్ ఎం.బాలాజి అకౌంట్స్ అసిస్టెంట్ డి.లక్ష్మీపతిరాజులతో పాటు ఇద్దరు కాంట్రాక్టర్లు రమేష్ రెడ్డి రహంతుల్లాలను అరెస్టు చేసి శనివారం కర్నూలులోని సీబీఐ కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసులో మరింత లోతుగా విచారించడానికి నిందితులను పోలీసు కస్టడీకి ఇవ్వాలని సీబీఐ అధికారులు కోర్టును కోరారు. అయితే నిందితుల తరుపున న్యాయవాదులు వి.లక్ష్మీనారాయణ, ఉమా హనుమంతరావులు అభ్యంతరం చెప్పారు. అయితే.. పోలీసు కస్టడీకిగానూ వేరుగా పిటిషన్ దాఖలు చేసుకోవాలని న్యాయాధికారి సీబీఐ అధికారులకు చెప్పి కస్టడీని తిరస్కరించారు. అనంతరం ఏడుగురు నిందితులను కర్నూలు జిల్లా జైలుకు తరలించారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యం

నీతి అయోగ్ డిప్యూటీ డైరెక్టర్ శృతి స్వప్రవాల్

చిప్పగిరి, జూలై 6: పేదలు లేని దేశంగా భారతదేశాన్ని అభివృద్ధి చేయడమే ప్రధాన మంత్రి మోదీ లక్ష్యమని నీతి ఆయోగ్ డిప్యూటీ డైరెక్టర్ శృతి స్వప్రవాల్ అన్నారు. చిప్పగిరిలో ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన 'సంపూర్ణత- అభియాన్' కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో 500 వెనుకబడిన మండలాలను గుర్తించామన్నారు. కర్నూలు జిల్లాల్లో చిప్పగిరితో పాటు హాలహర్వి, మద్దికెర మండలాలు కూడా ఆ జాబితాలో ఉన్నాయన్నారు. ఈ మండలాల్లో వైద్యం, విద్య, వ్యవసాయం, మహిళ సాధికారత, సంక్షేమం తదితర అంశాలపై కేంద్ర ప్రభుత్వం చేయూతనిస్తుందన్నారు. ఉత్తమ ఫలితాలు రావాలంటే స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజల సహకారం అవసరమని పేర్కొన్నారు. అందుకోసమే ఈ సమావేశాలను ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ సహకరించి పేదరిక నిర్మూలనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెలుగు పీడీ సలీం భాష, సీపీవో హేమ ప్రభాకర్, ఈఎల్‌డీవో నాగేశ్వరరావు, ప్రోగాం అఫీసర్ లక్ష్మనరసింహ, ఎంపీపీ జూటూరు హేమలత, తహసీల్దారు పద్మజ, ఎంపీడీవో బాలన్ సాబ్, ఎంఈవో సావిత్రి, లతీఫ్, ఏవో జయలక్ష్మి, ఏపీవో నాగార్జున, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

చెన్నకేశవుడికే శఠగోపం..!

- దేవదాయ శాఖ భూమిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం
- వైసీపీ చోటా నాయకుడి దందా

పత్తికొండ టౌన్, జూలై 6: చెన్నకేశవ స్వామికే శఠగోపం పెట్టాడు. ఏకంగా కోర్టులో పెండింగ్‌లో ఉన్న దేవదాయ శాఖ భూమిలోనే వెంచర్ వేసి ప్లాట్ల విక్రయాలు సాగించాడు. గత ప్రభుత్వంలో ఓ వైసీపీ చోటా నాయకుడు సాగించిన దందా ఇది. పత్తికొండ-ఆదోని ప్రధాన రహదారిలోని సెయింట్ జోసెఫ్ బీఈడీ కాలేజీ ఎదురుగా ప్రధాన రోడ్డు పక్కన 696 సర్వే నెంబరులో చెన్నకేశవస్వామి దేవాలయం మాన్యం ఉంది. ఈ భూమి మండిగిరి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్నట్టు తెలుస్తోంది. సర్వే నెంబరు 696లో సుమారు 61 ఎకరాల ఇనాం భూమి ఉన్నట్టు రికార్డులు తెలుపుతున్నాయి. ఇందులో ఎలాంటి సబ్ డివిజన్ జరగనప్పటికీ గత ప్రభుత్వంలో ఓ చోటా వైసీపీ నాయకుడు ఆరు ఎకరాల్లో వెంచర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు బ్రోచర్‌ను ముద్రించాడు. డిప్పు పద్ధతిని ప్లాట్లు ఇస్తామని చెప్పి 400 మందితో నెలనెలా ఒక్కొక్కరి నుంచి రూ.2 వేల చొప్పున అక్రమ వసూళ్లకు తెరలేపాడు. డిప్పు ద్వారా ప్లాట్లు సొంతం చేసుకున్న వారు తమ ప్లాట్లను రిజిస్టర్ చేయించాలని వెంచర్ యజమానులను కోరినప్పటికీ రేపూ.. మాపో అంటూ కాలయాపన చేస్తున్నాడు. అయితే దేవదాయ శాఖ భూమిలో ఎలా లావాదేవీలు జరుపుతారంటూ ఎండోమెంటు శాఖ స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. దీంతో ఆ భూమిని అడ్డదారుల్లో కొనుగోలు చేసిన రైతులు, ఇటు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కోర్టును ఆశ్రయించారు. వివాదం కోర్టులో ఉన్నప్పటికీ రియల్ ఎస్టేట్ వ్యాపారులు మాత్రం తమ పార్టీ అధికారంలో ఉందని నెల నెలా డిప్పుల పేరుతో వసూలు చేస్తూ అక్రమ సంపాదనకు సాగిస్తున్నారు. ఇందులో మోసపోయిన కొంత మంది లబ్ధిదారులు కోర్టులో పెండింగ్‌లో ఉన్న భూములపై ప్లాట్లు వేసి ఎలా విక్రయిస్తారంటూ బహిరంగంగా నిలదీయడంతో బండారమంతా బట్టబయలైంది. నిలదీసిన వారికి తిరిగి తమ డబ్బులు చెల్లిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అక్రమ వ్యాపారాలు సాగిస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



దేవదాయశాఖ భూములో నెలనెలా డిప్పు వేసినట్లు ముద్రించిన బ్రోచర్



ప్లాట్లు వేసిన దేవదాయశాఖ భూమిని చూపిస్తున్న బాధితుడు



31 నెలలు డబ్బులు చెల్లించా

దేవదాయశాఖ భూమి సర్వే నెం.696లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్ ఏర్పాటు చేశారు. నెలనెలా రూ.2వేలు కట్టుకోండి.. విలువైన బహుమతులు సొంతం చేసుకోండంటూ ఆకర్షణీయమైన బ్రోచర్లను ముద్రించారు. దీంతో ఆ బ్రోచర్లను చూసి నమ్మి 31 నెలల పాటు ప్రతి నెలా రూ.2వేలు చెల్లించాను. ఈ వెంచరులో దేవదాయ శాఖ భూమి ఉందని, అందులో ప్లాట్లు రిజిస్టర్ కావని తెలిసింది. ఈ విషయాన్ని వెంచర్ వేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులను నిలదీస్తే.. గుట్టు చప్పుడు కాకుండా నేను కట్టిన డబ్బులను తిరిగి ఇచ్చేశారు. ఇందులో అనేక మంది లబ్ధిదారులు మోసపోయారు. ఇలాంటి అక్రమ వెంచర్‌ను ఏర్పాటు చేస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి.

- సోమ్లా నాయక్

వివాదం కోర్టులో ఉంది

సర్వే నెం.696లోని భూమి వివాదం కోర్టులో ఉంది. ఈ భూమిపై ఎలాంటి లావాదేవీలు జరపకూడదని ఆదేశాలు ఉన్నాయి. అయితే.. వెంచర్లు వేసి ప్లాట్లు విక్రయిస్తున్నారన్న సమాచారం మాకు లిఖిత పూర్వకంగా అందలేదు. ఒకవేళ ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

- తహసీల్దార్ మాధవరాజు

మల్లన్న సన్నిధిలో

ఏపీ హైకోర్టు జడ్జి



ఆలయ ప్రాంగణంలో జస్టిస్ ఎ.వి రవీంద్ర బాబు దంపతులు

శ్రీశైలం, జులై 6: శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి,అమ్మవార్లను శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ ఎ.వి రవీంద్ర బాబు దంపతులు దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు ఆలయ అర్చకులు అలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం జస్టిస్ ఎ.వి రవీంద్ర బాబు దంపతులు రత్నగర్భ గణపతి స్వామిని దర్శించుకుని రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం భ్రమరాంబికాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో జస్టిస్ ఎ.వి రవీంద్రబాబు దంపతులకు వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు. తరువాత ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు జస్టిస్ ఎ.వి రవీంద్ర బాబుకు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

మల్లన్న సేవలో తెలంగాణ ఎమ్మెల్యేలు

శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను శనివారం తెలంగాణ రాష్ట్ర ఐదు మంది ఎమ్మెల్యేలు దర్శించుకున్నారు. ఎమ్మెల్యేలు సంపత్, రాజేష్ రెడ్డి, వీర్లపల్లి శంకర్, కసిరెడ్డి నారాయణరెడ్డి, మేగా రెడ్డి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యేలు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకురు. తెలంగాణ పర్యాటకశాఖ సేవలను మరింత విస్తరించేందుకు స్టడీటూర్‌లో భాగంగా ఎమ్మెల్యేలు శ్రీశైలం అక్కమహాదేవి గుహలను సందర్శించారు.

ఇసుక... సులభమిక..!



గత వైసీపీ ప్రభుత్వంలో విచ్చలవిడిగా సాగిన ఇసుక దోపిడికి టీడీపీ ప్రభుత్వం చెక్ పెట్టింది. ఉచిత ఇసుక పాలసీ అమలుకు సై అంది. సోమవారం నుంచి గుర్తించిన రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలకు విధివిధానాలు ఖరారు చేశారు. కేవలం నదిలో ఇసుక తవ్వి ఒడ్డున చేర్చడం, లోడింగ్ చేయడం, సీనరేజ్ చార్జీలు మినహా ప్రభుత్వం అదనంగా ఒక్కపైసా కూడా వసులు చేయడం లేదు. సీనరేజ్ అమౌంట్‌ను కూడా స్థానిక సంస్థల అభివృద్ధి కోసం పంచాయతీ ఖాతాలకు జమ చేస్తారు. జిల్లాలో ఎక్స్‌కలేషన్ చార్జీ, రాయల్టీ, డీఎంఎఫ్, అడ్మినిస్ట్రేషన్ చార్జీలు, జీఎస్‌టీ కలిపి టన్నుకు రూ.335 నిర్ణయించారు. గత వైసీపీ ప్రభుత్వంలో రూ.675 ఉండేది. వినియోగదారులకు రూ.340 ఆదా అవుతుందని మైనింగ్ అధికారులు అంటున్నారు. ఉచిత ఇసుక పాలసీ, విధివిధానాలను శనివారం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా వివరించారు.

కర్నూలు, జూలై 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక తవ్వకాలు, రవాణా కోసం కౌతాళం మండలం నదిచాగి వద్ద 9.8 హెక్టార్లు, గుడికంబాళి వద్ద 10 హెక్టార్లు, మరళి వద్ద 5 హెక్టార్లు ఓపన్ ఇసుక రీచ్‌లు, సి.బెళగల్ మండలం పరిధిలో కొత్తకోట, కె.సింగవరం, పల్లెదొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె గ్రామాల వద్ద మరో నాలుగు డీసిల్టేషన్ రీచులు (నీటిలో బోటు ద్వారా ఇసుక తవ్వకాలు) గనులు, భూగర్భ వనరుల శాఖ అధికారులు గుర్తించారు. వైసీపీ ప్రభుత్వంలో జేపీ పవర్ సంస్థ, ఆ తరువాత ప్రతిమ ఇన్‌ఫ్రా సంస్థలకు ఇసుక తవ్వకాలు, రవాణా లీజుకు ఇచ్చారు. గత నెల 12న సీఎం చంద్రబాబు సారథ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక పాలసీ అమలుకు శ్రీకారం చుట్టారు. అదే సమయంలో లీజు కాంట్రాక్ట్ సంస్థలు ఒప్పందాన్ని కూడా రద్దు చేసుకున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం 8వ తేది నుంచి నూతన విధానం అమలు చేయనున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో టన్ను ఓపన్ రీచ్‌ల్లో రూ.475, కొత్తకోట, కె.సింగవరం, పల్లెదొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె గ్రామాల డీసిల్టింగ్ రీచ్‌ల్లో రూ.675 విక్రయించేవారు. ఇసుక అమ్మ కాలను రద్దు చేసిన చంద్ర బాబు ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ విధానం అమలు చేసేందుకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వం ఉచితంగా ఇసుకను ఇస్తున్నప్పటికీ సీనరేజ్, లోడింగ్, రవాణా చార్జీలను వినియోదారులే భరించాల్సి ఉంటుంది.

టన్ను ఇసుకకు నిర్ణయించిన ధర

వివరాలు	ధర
ఎక్స్‌కలేషన్ చార్జీ	రూ.144
సీనరేజ్	రూ.88
లోడింగ్	రూ.30
అడ్మినిస్ట్రేషన్ చార్జీ	రూ.20
జీఎస్‌టీ	రూ.53
మొత్తం	రూ.335

టిప్పరుపై రూ.8 వేలు ఆదా

జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ కృష్ణకాంత్, మైనింగ్ డీడీ రాజశేఖర్ సహా సబంధిత అధికారులు శనివారం సమావేశమై జిల్లాలో ఉచిత ఇసుక పాలసీ అమలుపై మార్గదర్శకాలు జారీ చేశారు. ఇసుక రవాణా, రేటు నిర్ణయంపై పూర్తిగా జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డీఎల్ఎస్‌సీ)కి అప్పగించారు. ఆ కమిటీ సీనరేజ్, లోడింగ్, ఎక్స్‌కలేషన్, జీఎస్‌టీ కలిపి టన్నుకు రూ.335 రేటు నిర్ణయించారు. గత వైసీపీ ప్రభుత్వంలో సి.బెళగల్ మండలం కొత్తకోట, కె.సింగవరం, పల్లెదొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె గ్రామాల వద్ద డీసిల్టింగ్ రీచ్‌ల్లో టన్ను రూ.675గా ఉండేది. తాజాగా జిల్లా కమిటీ రూ.335 నిర్ణయించింది. అంటే టన్నుకు రూ.340 చొప్పన 24 టన్నుల టిప్పరుపై రూ.8,160 వినియోదారుడికి ఆదా అవుతుంది. అదే కౌతాళం మండలం నదిచాగి, గుడికంబాళి, మరళి ఓపన్ రీచ్‌ల వద్ద టన్ను రూ.475 ఉండేది. అక్కడ టన్నుకు రూ.140 ప్రకారం 24 టన్నుల టిప్పరుపై రూ.3,360 ఆదా అవుతుంది. ప్రస్తుతం కౌతాళం మండలం గుడికంబాలి స్టాక్ పాయింట్‌లో 29,351 టన్నుల ఇసుక అందుబాటులో ఉందని అధికారులు పేర్కొన్నారు.

పకడ్బందీగా ఉచిత ఇసుక పాలసీ అమలు

పి.రంజిత్ బాషా, జిల్లా కలెక్టరు

ఉచిత ఇసుక విధానం పక్కాగా అమలు చేస్తాం. ఎక్స్‌కలేషన్, లోడింగ్, సీనరేజ్ (రాయల్టీ, డీఎంఎఫ్, మెరిట్), అడ్మినిస్ట్రేషన్ చార్జీలు, జీఎస్‌టీ కలిపి టన్నుకు రూ.335 ధర నిర్ణయించాం. గతంలో డీషిల్టింగ్ రీచ్‌ల్లో టన్ను రూ.675 ఉండేది. ఈ విధానం వల్ల టన్నుకు రూ.340 ఆదా అవుతుంది. సోమవారం నుంచి ఈ విధానం అమలుల్లోకి వస్తుంది. ఇసుక డిపోల వద్ద వీఆర్ఏ లేదా వీఆర్ఓలను ఇన్‌చార్జిలుగా నియమిస్తాం. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇసుక రవాణా చేయవచ్చు. ఎక్కడైనా అక్రమాలు జరిగితే స్టాక్ పాయింట్ ఇన్‌చార్జిలదే బాధ్యత. వారిపై శాఖపరమైన చర్యలు ఉంటాయి. ఇసుక రవాణా వివరాలు ఎప్పటికప్పుడు తనకు అప్డేట్ చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం గుడికంబాలి స్టాక్ పాయింట్ వద్ద 29,351 టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. కౌతాళం తహసీల్దారు పంచనామా చేసి ఇసుకను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించాం. సి.బెళగల్ మండలంలోని కొత్తకోట, కె.సింగవరం, ఈర్లదిన్నె, ఉడుమాల, పల్లెదొడ్డి వద్ద ఉన్న డీసిల్టింగ్ రీచ్‌లకు పర్యావరణ అనుమతులు రాగానే వినియోగంలోకి తీసుకొస్తాం. ఈసీ అనుమతుల కోసం మైనింగ్ డీడీని ఆదేశించాం. ప్రతి డీసిల్టింగ్ పాయింట్ వద్ద ఒకరిని ఇన్‌చార్జిని నియమించేలా ఆర్డీఓను ఆదేశించాం.

- సీనరేజ్, లోడింగ్ చార్జీలు మాత్రమే వసూలు
- టన్నుకు రూ.335 రేటు నిర్ణయించిన జిల్లా కమిటీ
- నేటి నుంచి అందుబాటులోకి ఇసుక
- గుడింకబాలి వద్ద అందుబాటులో 29,351 టన్నులు



గుడికంబాళిలోని ఇసుక రీచ్

ఇసుక పాలసీపై కలెక్టర్ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు(కలెక్టరేట్), జూలై 6: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో సోమవారం నుంచి ఉచిత ఇసుక విధానం అమలు చేయనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. శనివారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ.జి.కృష్ణకాంత్‌తో కలిసి సంబంధిత అధికారులతో కలెక్టర్ జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డీఎల్ఎస్‌సీ) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో గనుల శాఖ డీడీ రాజశేఖర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ముని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాటసాని నుంచి ప్రాణహాని

- మల్లెల రాజశేఖర్ సంచలన ఆరోపణలు
- ఎమ్మెల్యే గౌరు చరితతో కలిసి ఎస్పీకి ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

కల్లూరు, జూలై 6: పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి నుంచి తనకు ప్రాణహాని ఉందని నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. శనివారం ఆయన పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితతో కలిసి ఎస్పీ కృష్ణకాంత్‌కు ఫిర్యాదు చేశారు. పాణ్యం నియోజకవర్గంలో ఫ్యాక్షన్ రహిత పాలనే తమ లక్ష్యమని, అందుకు సహకరించాలని ఎమ్మెల్యే గౌరు చరిత కోరారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని ఓటమిని జీర్ణించుకోలేక పచ్చని గ్రామాల్లో ఫ్యాక్షన్ గొడవలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. 2024 ఎన్నికల్లో కాటసాని ఓటమికి ప్రధాన కారణం తానే అని కక్ష గట్టారని మల్లెల రాజశేఖర్ అన్నారు. అలాగే యువగళం పాదయాత్రలో నారా లోకేశ్‌ను దూషించడంతో నాలుక కోస్తా అని పేపరు ప్రకటన ఇచ్చానని, అప్పటి నుంచి కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కాటసాని శివనరసింహారెడ్డి తనపై ద్వేషం పెంచుకున్నారని వివరించారు. హుసేనాపురం గ్రామానికి చెందిన జీకే వెంగళరెడ్డి, గుర్రాల చెన్నారెడ్డి, లోటస్ బాషాలతో కలిసి తనను అంతమొందించేందుకు వ్యూహం పన్నుతున్నారని తెలిసిందని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. బొమ్మిరెడ్డిపల్లెలో తెలుగుదేశం పార్టీ వాడిని చంపినట్లు మల్లెల రాజశేఖర్‌ను కూడా నరికి చంపండని, మిగతా సంగతి తాను చూసుకుంటానని చెప్పినట్లు తెలిసిందన్నారు. లోటస్ బాషా ఈ విషయాలను గ్రామ సర్పంచు గోవర్ధనమ్మ భర్త కురువ పెద్దస్వామితో చెప్పారని ఎస్పీకి వివరించారు. గ్రామ వైసీపీ నాయకులపై కేసు నమోదు చేసి తనకు రక్షణ కల్పించాలని కోరారు.

పట్టపగలే దొంగతనం

8.50 తులాల బంగారు, రూ.1.30 లక్షల అపహరణ

బేతంచెర్ల, జూలై 6: పట్టణంలో సెంట్ ఆన్స్ పాఠశాల ఎదురుగా ఉన్న కాలనీలో నివాసం ఉంటున్న వెంకటరమణ ఇంట్లో పట్టపగలే దొంగలు పడ్డారు. 8.50 తులాల బంగారు, రూ.1.30 లక్షల నగదును దోచుకెళ్లారు.. వెంకటరమణ తన కోడలు లక్ష్మీఅరుణ గర్భిణి కావడంతో ఉదయం 9 గంటలకు శాంతిరాం హాస్పిటల్‌కు వెళ్లాడు. వెంకటరమణ కుమారుడు గిరీష్ కుమార్ వర్క్‌షాపు నుంచి సాయంత్ర 4 గంటల సమయంలో ఇంటికి వచ్చి చూడగా తాళం తీసి ఉంది. దొంగతనం జరిగినట్లు భావించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్ఐ శివశంకర్ నాయక్ తన సిబ్బందితో దొంగతనం జరిగిన సంఘటనా స్థలానికి చేరుకున్నాడు. రెండు బీరువాల లాకర్‌ను పగుల కొట్టి 8.50 తులాల బంగారు, రూ.1.30 లక్షల నగదు అపహరించుకుని వెళ్లారని బాధితుడు ఎస్ఐకు వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కర్నూలు ఎంపీకి ఘన స్వాగతం



కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజుకు పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలుకుతున్న మిత్రులు

డోన్(రూరల్), జూలై 6: పార్లమెంటులో ప్రమాణస్వీకారం చేసి కర్నూలు జిల్లాకు వచ్చిన కర్నూలు జిల్లా ఎంపీ బస్తిపాటి నాగరాజుకు ఆయన మిత్ర బృందం నుంచి ఘన స్వాగతం లభించింది. కర్నూలు జిల్లా కేంద్రం సమీపంలోని పంచలింగాల దగ్గర కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజుకు ఆయన మిత్ర బృందం డోన్, ఎరుకులచెరువుకు చెందిన వ్యాపారవేత్తలు దస్తగిరి, సాయి శివకుమార్‌లు పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. కర్నూలు ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసి రావడంపై హర్షం వ్యక్తం చేశారు.

అలా కానిచ్చేశారు..!

- మొక్కుబడిగా సాగిన స్థాయి సంఘాల సమావేశం
- మౌనం పాటించిన జడ్పీటీసీలు
- ఆర్అండ్‌బి రోడ్డుపై దుమారం



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కర్నూలు(న్యూసిటీ), జూలై 6: ప్రతీసారి వాడివేడిగా జరిగే జడ్పీ స్థాయి సంఘాల సమావేశాలు శనివారం మాత్రం మొక్కుబడిగా కానిచ్చేశారు. ఉమ్మడి జిల్లాలోని సమస్యలను లేవనెత్తడంలో జడ్పీటీసీలు మౌనం వహించారు. ఒకరిద్దరు మినహా మరెవరూ గట్టిగా వాదనలు చేయలేకపోయారు. అధికారుల దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కరించడానికి కృషి చేయాల్సిన జడ్పీటీసీలు వాటి గురించి పట్టించుకోకపోవడం గమనార్హం. ఏదో కొన్ని సమస్యలను కొందరు ప్రశ్నించి మొక్కుబడిగా జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలను పూర్తి చేశారు. శనివారం జిల్లా పరిషత్ మినీ సమావేశభవనంలో ఏడుస్థాయి సంఘాల సమావేశం సీఈఓ జి.నాసరరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఉమ్మడి జిల్లా అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా చేసిన పనులకు బిల్లులు 8 నెలలుగా అందడం లేదని, బిల్లులు వస్తాయా.. రావా? నీరు-చెట్టు బిల్లుల కోసం కోర్టుకు వెళ్లినట్లు వెళ్లాలా? అంటూ ఒకరిద్దరు సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

రోడ్డు వేస్తే కేసులా..?

కొలిమిగుండ్ల మండల తుమ్మలపెంట గ్రామం వద్ద ఒక సిమెంటు కంపెనీ ద్వారా రూ.70 లక్షల విలువతో రోడ్డు వేయిస్తే కేసులు పెట్టడం సమంజసం కాదని, కేసును ఉపసంహరించుకోవాలని ఆర్అండ్‌బి ఈఈ శ్రీధర్‌రెడ్డిని జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి కోరారు. 'మీరు రోడ్లు వేయరు..వేసిన వారిని ఎందుకు వేధిస్తు న్నారు.' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వాళ్లు ఏదో ఫ్యాక్టరీ కోసం రోడ్డు వేసు కుంటే ఎందుకు అడ్డుకుంటున్నారని పలువురు జడ్పీటీసీలు అసహనం వ్యక్తం చేశారు.

ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై చైర్మన్ ఆగ్రహం

జిల్లాలో తాగునీటిపై శ్రద్ధ వహించడం లేదని జిల్లా పరిషత్ చైర్మన్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం సమస్య వచ్చినప్పుడు.. పత్రికల్లో కథనాలు ప్రచురితమైనప్పుడు మాత్రమే హడావుడిగా సంబంధిత గ్రామాలకు వెళ్లి వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న తరుణంలో ఎలాంటి ప్రణాళికలు చేయడం లేదని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరావుపై చైర్మన్ మండిపడ్డారు. గ్రామీణ ప్రజలకు శుద్ధజలాన్ని ఎప్పుడు అందిస్తారని చైర్మన్ ఎస్ఈని ప్రశ్నించారు. అపరిశుభ్రమైన నీరు తాగడం వల్ల రోగాల బారిన పడుతున్నారన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయకపోవడం వల్లే ఇలాంటి సమస్యలు వస్తున్నాయని చైర్మన్ స్పష్టం చేశారు. ఇందుకు స్పందించిన ఎస్ఈ గత నెల 18 నుంచి 30 వరకు తాగునీటి పథకాలు, ఓహెచ్ఆర్‌లను శుభ్రం చేశామని వివరించారు.

నిండా మోసం..!

- పెట్టుబడి సొమ్ము పరులపాలు
- నిలదీసిన రైతులకు రాయితీ బదిలీ
- సచివాలయ ఉద్యోగుల చేతివాటం



పెద్దహరివాణం ఆర్బీకే సెంటర్

ఆదోని రూరల్, జూలై 6: జిల్లాలోని పలు గ్రామ సచివాలయాల్లోని ఉద్యోగులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. రైతులను ముంచేసి వారికి న్యాయంగా రావాల్సిన నిధులను పక్కదారి పట్టిస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారుల నిర్వాకం వల్ల నిజమైన లబ్ధిదారులకు పెట్టుబడి రాయితీ దక్కడం లేదు. పైగా వైసీపీ నాయకులు, అధికారుల బంధువర్గాల ఖాతాల్లో ఈ సొమ్ము జమ కావడం ప్రస్తుతం ఆదోని నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. ఆదోని మండలంలో 30 సచివాలయ పరిధిలో 37 ఆర్బీకేలు ఉన్నాయి. ఇందులో వ్యవసాయ సహాయక అధికారులు 30మంది, ఎంపీఈఓలు ఏడుగురు విధులు నిర్వహిస్తున్నారు. 2023-24 కరువు మండలంగా ఆదోనిని ప్రభుత్వం ప్రకటించింది. 18,496 హెక్టార్ల భూమికి సంబంధించి 21,933 మంది రైతులకుగాను రూ.30.77 కోట్లకు అధికారులు పెట్టుబడి రాయితీ అవసరమని నివేదిక పంపారు. సార్వత్రిక పోలింగ్ అనంతరం ప్రభుత్వం రైతులకు పెట్టుబడి రాయితీని వారి ఖాతాల్లో వేశారు.

మ్యానువల్ మాయాజాలం: రైతులకు పెట్టుబడి రాయితీ విషయంలో అధికారులు మ్యానువల్‌గా రైతుల వివరాలను తీసుకొని ప్రభుత్వానికి పంపుతారు. ఇక్కడే వ్యవసాయ సహాయక అధికారులు తమ మాయాజాలాన్ని చూపించారు. రైతుల సర్వే నంబర్ ఖాతా నెంబర్లకు వీరి అనుకూలమైన వారి బ్యాంకు అకౌంట్ నెంబర్‌తోపాటు ఐఎఫ్‌సీ కోడ్‌ను జత పరిచి నివేదికలు పంపారు. అది కూడ 30 మంది రైతులకు పడాల్సిన పెట్టుబడి రాయితీ పెద్దహరివాణం గ్రామానికి చెందిన ఓ వ్యవసాయ సహాయక అధికారి సామాజిక వర్గానికి చెందిన వారి ఖాతాలో పడటం గమనార్హం. ఆదోనికి చెందిన ఇద్దరు రైతుల భూములు బైచిగేరి పంచాయితీ పరిధిలో ఉన్నాయి. వీరు కూడా పెట్టుబడి రాయితీకి ఎంపికయ్యారు. కానీ వీరి ఖాతాల్లో పడాల్సిన రూ.25వేల డబ్బులు అదే గ్రామానికి చెందిన ఓ వైసీపీ నాయకుడి బ్యాంకు ఖాతాలో పడ్డాయి. విషయం తెలుసుకున్న ఆ ఇద్దరు రైతులు సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయ అధికారికి ఫోన్ చేయడంతో అసలు విషయం బయటకు వచ్చింది. దీంతో అధికారులు, సదరు వైసీపీ నాయకుడు విషయం బయటకు పొక్కకుండా చర్యలు తీసుకున్నారు. ఆ రైతులకు వైసీపీ నాయకుడి ద్వారా రూ.20వేలు ఇప్పించాడు. పెద్దహరివాణం గ్రామానికి చెందిన ఐదు నుంచి 10మంది రైతులకు పైవిధంగానే సంబంధిత ఆ గ్రామ అధికారి పెట్టుబడి రాయితీని తిరిగి వేయించారు. రైతుల ఖాతాల్లో పడాల్సిన డబ్బు ఇతరులకు వెళ్లడంలో సచివాలయ ఉద్యోగుల పాత్ర కీలకంగా ఉన్నట్లు పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా గోనెగండ్ల మండలంలోని కైరవాడి, ఎర్రబాడు, పెద్దనెలటూరుతో పాటు ఆదోని మండలంలోని చిన్నహరివాణం, బల్లేకల్లు, తదితర గ్రామాల్లో కూడా పలువురు అధికారులు ఇలాంటి అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తోంది.

ఫిర్యాదులు వచ్చాయి.. విచారణ చేస్తున్నాం

పెద్దహరివాణం గ్రామానికి చెందిన 10మంది రైతులు జాబితాలో తమ పేర్లున్న తమకు పెట్టుబడి రాయితీ పడలేదని, రైతుల ఖాతాలకు కాకుండా ఇతరుల ఖాతాల్లో నగదు జమఅయిందని ఫిర్యాదు చేశారు. దాని ఆధారంగా విచారణ చేస్తున్నాం. నిజానిజాలు తెలుసుకొని బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

-అశోక్ కుమార్‌రెడ్డి, ఏఓ ఆదోని

సమగ్ర శిక్ష ఉద్యోగుల వేతన వెతలు

రెండు నెలల నుంచి జీతాలు పెండింగ్

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 6: జిల్లా సమగ్ర శిక్షలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న ఉద్యోగులకు వేతన కష్టాలు తప్పడం లేదు. గత రెండు నెలల నుంచి జీతాలు అందక ఆర్థికలితో అలమటిస్తున్నారు. ఎన్డీయే ప్రభుత్వం వచ్చిన తర్వాత తమ కష్టాలు గట్టెక్కుతాయని భావించారు. అయినా వారి కష్టాలు పరిష్కారం కాలేదు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చేది అరకొర వేతనమే. అది కూడా చెల్లించకపోవడంతో ఇటు ఉద్యోగ బాధ్యతలను, అటు కుటుంబ పోషణ నిర్వహించలేక సతమతమవుతున్నారు. అధిక వడ్డీలకు అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కర్నూలు జిల్లాలో సమగ్ర శిక్ష డీపీవో, మండల స్థాయిలో అన్ని కేటగిరీల ఉద్యోగాల పోస్టులు 586 ఉన్నాయి. ఇందులో 167 పోస్టులు ఖాళీలు ఉన్నాయి. క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సీఆర్పీలు) 151, మండల స్థాయి అకౌంటెంట్లు 26, డేటా ఎంట్రీ ఆపరేటర్లు 7, ఎంఐఎస్ కోఆర్డినేటర్ 26, ఐఈఆర్‌టీఎస్ 52, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్స్ 258, మండల స్థాయిలో డేటా ఆపరేటర్లు 26, మెసెంజర్స్ 26, డీపీవో ఆఫీసు సబార్డినేట్ 6 పోస్టులు ఉన్నాయి. అన్ని కేటగిరీలో కలిపి 412 మంది మాత్రమే పని చేస్తున్నారు. 167 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మే, జూన్ నెలల జీతాలు ఉద్యోగులకు జమ కాలేదు. ఈ ఉద్యోగులే కాకుండా సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వ ర్యంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో 36 మోడల్ స్కూల్స్ హాస్టల్‌లో వార్డెన్లు, కుక్‌లు, అసిస్టెంట్ కుక్‌లు, వాచ్‌మెన్లు కలిపి దాదాపు 150 మంది వరకు పని చేస్తున్నారు. ఉద్యోగులకు జీతాలు అందకపోతే తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ పథకాలకు దూరం

సమగ్ర శిక్ష అభియాన్‌లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కింద పని చేసే ఉద్యోగులకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వర్తించడం లేదు. ప్రతి విద్యార్థికి ఇచ్చే అమ్మఒడి, చేతివృత్తుల కింద మహిళలకు ఇచ్చే ఆర్థిక సాయానికి కూడా దూరమయ్యారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం నామమాత్ర వేతనాలు చెల్లిస్తోందని, దీనికి తోడు పథకాలకు అనర్హులుగా ప్రకటించడం ఈ ఉద్యోగులు చేసుకున్న నేరమా అని మదనపడుతున్నారు. జూన్, జూలై నెలల్లో విద్యాసంస్థలు ప్రారంభం కావడంతో తమ పిల్లల బడి ఫీజులు, బస్సు చార్జీలు, యూనిఫాం, పుస్తకాలు, స్టేషనరీ వంటి ఖర్చులు భరించాల్సి వస్తోంది. నెలనెలా రావాల్సిన జీతాలు ప్రభుత్వం జమ చేయకపోవడంతో నరకయాతన అనుభవిస్తున్నారు. రెగ్యులర్ ఉద్యోగులుగా మాదిరిగానే తమకు నెలా నెలా జీతాలు చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు.

బడ్జెట్ విడుదల చేయాలి



ఏడాదికి ఒకేసారి ఉద్యోగులకు సరిపడా బడ్జెట్ విడుదల చేయాలి. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పార్ట్‌టైమ్ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. మే, జూన్ నెలల్లో వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. సమ్మె కాలం జీతాలు కూడా చెల్లించాలని కోరారు.

- ఏపీ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కో చైర్మన్ మహమ్మద్ రఫీ

రెగ్యులర్ వేతనాలు చెల్లించాలి



రెగ్యులర్ ఉద్యోగులతో పాటు సమగ్ర శిక్షలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలి. సమ్మె కాలానికి పెండింగ్‌లో ఉన్న వేతనంతో పాటు ఉద్యోగులకు పెంచిన జీతాలు కలిపి ఇవ్వాలి. ప్రభుత్వ పథకాలు కూడా ఈ ఉద్యోగులకు అమలు పరచాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలి.

- ఏపీ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు నాగేశ్వరరావు

ఎన్టీయేను రద్దు చేయాలి: పీడీఎస్‌యూ



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 6: వైద్యవిద్యార్థులకు శాపంగా మారిన ఎన్టీయేను రద్దు చేసి, రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని కాపాడి వైద్య విద్య పరీక్షను నిర్వహించే బాధ్యత రాష్ట్రాలకే కేటాయించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ, కార్యదర్శి బి.మహేంద్రబాబు కోరారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయం ముందు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై కేంద్ర ప్రభు త్వం స్పందించడం లేదన్నారు. దీనిపైనే పార్లమెంటో చర్చ జరిపారని, కేంద్ర విద్యాశాఖ మంత్రిని బర్తరఫ్ చేయాలని, నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణనాయుడు, రమణ, జిల్లా నాయకులు ఆలూరు, మునిస్వామి, హరి, రఘు, అస్లాం, రాజు, నబీ రసూల్ పాల్గొన్నారు.

రేపు అప్రెంటిస్‌షిప్ మేళా

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 6: ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ కళాశాలలో వృత్తి విద్యను అభ్యసించిన విద్యార్థులంతా బి.తాండ్రపాడులోని ఐటీఐ బాలికల కళాశాలలో సోమవారం జరిగే ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళాలకు హాజరు కావాలని జిల్లా వృత్తి విద్యాధికారి వై.పరమేశ్వరరెడ్డి, వృత్తి విద్యా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నాగస్వామి నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కళాశాలపై ప్రిన్సిపల్ సెక్రటరీ ఆరా

కర్నూలు(అర్బన్), జూలై 6: సిల్వర్ జూబ్లీ కళాశాల విద్యార్థులు కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ఆందోళనపై ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆరా తీశారు. కళాశాల నిధులు ఉండి కూడా కేటాయించక పోవడంతో విద్యార్థుల వసతులు, నిర్మాణాలకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని ..ఫలితంగా సమస్యలు జటిలమవుతున్నాయని వర్సిటీ ఉపకులపతి వివరణ ఇవ్వడంతో అసలు ఏమి జరుగుతుందని ప్రశ్నించారు. గతంలో 2021-22, 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఫీజుల్లో నిబంధనలకు విరుద్ధంగా అప్పటి ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్ కంప్యూటర్ల కొనుగోలు పేరుతో పక్క దారి పట్టించారన్న విద్యార్థుల ఫిర్యాదు మరోసారి తెరపైకి వచ్చింది. శనివారం ఉన్నత విద్యామండలి ప్రిన్సిపల్ సెక్రటరీ ఫీజులు, వ్యయం, ఖర్చులకు సంబంధించిన వివరాలను ఎందుకు ఉపకు లపతికి అప్పగించ లేదని సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్‌ను మందలిం చినట్లు తెలిసింది. తక్షణమే కళాశాలకు చెందిన నిధుల నుంచి రూ. 10 లక్షలు హాస్టల్ నిర్మాణాలకు, భోజన వసతులకు కేటాయించాలని ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశించినట్లు వర్సిటీ అధికారులు తెలిపారు.

ధర్నాను విజయవంతం చేయండి

కర్నూలు(న్యూసిటీ), జూలై 6: కలెక్టరేట్ ఎదుట ఈ నెల 10న జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ నగర అధ్యక్షుడు నరసింహులు పిలుపునిచ్చారు. గురువారం కార్మిక కర్షక భవన్‌లో హౌసింగ్ హమాలీ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో నూతన ప్రభుత్వాలు కొలువుదీరాయన్నారు. రాష్ట్రంలో కార్మికులకు వ్యతిరేకంగా కార్పొరేట్లకు అనుకూలంగా పని చేయడంతో ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. కార్మికుల డిమాండ్ల పరిష్కారం కోసం చేపడుతున్న ధర్నాకు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. ఈ సమావేశంలో విజేయుడు, ఎం.జయన్న, మల్లికార్జున, చెన్నయ్య, నాగరాజు పాల్గొన్నారు.

ఆర్థిక క్రమశిక్షణ పురోగతికి తొలిమెట్టు

కాగ్నిజెంట్ హెచ్‌ఆర్ మేనేజర్ జితేందర్‌సింగ్



మాట్లాడుతున్న జితేందర్‌సింగ్

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 6: ఆర్థిక క్రమశిక్షణ పురోగతికి తొలి మెట్టు అని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల కాగ్నిజెంట్ హెచ్‌ఆర్ మేనేజర్ జితేందర్‌సింగ్ అన్నారు. శనివారం జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో తృతీయ స్నాతకోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా జితేందర్‌సింగ్ మాట్లాడుతూ డిగ్రీ పట్టా తీసుకుని బయటి ప్రపంచంలోకి అడుగు పెడుతున్న విద్యార్థులకు ఆర్థిక క్రమశిక్షణ పాటించాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక రంగం ఎటు పయనిస్తుందో అటువైపు మీ ఆలోచనలు మళ్లాలని, వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల వ్యవస్థాపకుడు జి.పుల్లయ్య మాట్లాడుతూ ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండాలనే మనస్తత్వం మిమ్మల్ని ముందుకు నడిపిస్తుందన్నారు. అనంతరం కళాశాల చైర్మన్ జీవీఎం మోహన్ కుమార్, ప్రిన్సిపాల్ సి.శ్రీనివాసులు మాట్లాడారు. కార్యక్రమంలో గవర్నింగ్‌బాడీ సభ్యుడు ఎన్.విశాలి, జి.గోపినాథ్, జి.వంశీధర్, ఎం.గిరిధర్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, కన్వీనర్ జి.శశికుమార్, కళాశాల డీన్లు, శాఖాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, జూలై 6: నగరంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ-1 నాగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సంతోష్ నగర్, అశోక్‌నగర్ 11 కేవీ ఫీడర్ల పరిధిలో 33 కేవీ తీగల ఏర్పాటు చేయనున్నందున కరెంట్ కోత ఉంటుందన్నారు. శ్రీకృష్ణకాలనీ, అశోక్‌నగర్, లేబర్‌కాలనీ సమీపంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



డంప్ యార్డు పరిసరాలను పరిశీలిస్తున్న కమిషనర్

గూడూరు, జూలై 6: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగర కమిషనర్ దివాకర్ రెడ్డి అన్నారు. శనివారం గూడూరు నగర పంచాయతీ పరిధిలోని డంప్ యార్డు పరిసరాలను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంప్ యార్డులో వేసిన చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు శుభ్రపరిచి బ్లీచింగ్ పౌడర్ చల్లించాలన్నారు. అలాగే కొళాయి గుంతల్లో నీటి నిల్వలు ఉంచుకోకుండా శుభ్రంగా ఉంచుకో వాలని సూచించారు. సీజనల్ వ్యాధులకు సంబంధించి నగర పంచాయతీ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. దానికి సంబం ధించి ఎటువంటి సమాచారమైన కంట్రోల్ రూమ్ ఇన్‌చార్జి కేసీ రవిని సంప్రదించాలని సూచించారు. ఆయన వెంట ఏఈ నరసింహులు, నగర పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ఓటమి ఎరుగని నాయకుడు జగ్జీవన్‌రామ్

జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కే బాబురావు




జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్, టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు

కర్నూలు(అర్బన్), జూలై 6: ఓటమి ఎరుగని నాయకుడు బాబు జగ్జీవన్‌రామ్ అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కే. బాబురావు అన్నారు. శనివారం బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఐదురోడ్ల కూడలిలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం అక్కడి నుంచి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి చేరుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మూలింటి మారెప్ప, మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీకృష్ణ, ఉండవల్లి వెంకటన్న, లాజరస్, ప్రమీలా, ఏ. వెంకట సుజాత పాల్గొన్నారు.

● **టీడీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో..** దళిత జన బాంధవుడు బాబు జగ్జీవన్ రామ్ అని టీడీపీ ఎస్సీ సెల్ కర్నూలు నగర కార్యదర్శి ఏసన్న అన్నారు. నగరంలోని ఐదురోడ్ల కూడలిలో ఆయన కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు పి.శివన్న, కర్ణ, టి.శారదమ్మ, బూత్ ఇన్‌చార్జిలు భాస్కర్, జయన్న, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ సమావేశం రసాభాస

మేయర్‌ను నిలదీసిన వైసీపీ నాయకుడు



వైసీపీ నాయకుడు మల్లిని వారిస్తున్న మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు(న్యూసిటీ), జూలై 6: కర్నూలు, కోడుమూరు, పాణ్యం నియోజక వర్గాల వైసీపీ కార్పొరేటర్లు, కార్యకర్తలు, నాయకులు సమావేశం రసాభాసగా జరిగింది. శనివారం నగరంలోని బీఏఎస్ కల్యాణ మండపంలో జరిగిన సమావేశానికి వైసీపీ డిప్యూటీ రీజినల్ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, నగర మేయర్ బీవై.రామయ్య, మాజీ ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, డిప్యూటీ మేయర్లు సిద్ధారెడ్డి రేణుక, నాయకల్లు అరుణ హాజరయ్యారు. ఈనెల 10న జరిగే కౌన్సిల్ సమావేశాన్ని పురస్కరించుని సమావేశం ఏర్పాటు చేశారు. అయితే కేవలం 20 మంది కార్పొరేటర్లు మాత్రమే హాజరుకావడం గమనార్హం. సమావేశంలో అతిథులు మాట్లాడుతుండగానే 43వ వార్డు కార్పొరేటర్ మునెమ్మ కుమారుడు మల్లి కలగజేసుకుని మూడేళ్లలో ఏనాడైనా సమావేశం నిర్వహించారా అని ప్రశ్నించారు. కార్యకర్తలు, నాయకులు లేనప్పుడు మీకు పదవులు ఎందుకు..సమస్యలను పరిష్కరించకుండా మూడేళ్ల పదవులను అలంకరించావని మల్లి మేయర్‌ను నిలదీశారు. ఇంతలో మేయర్ ఇక్కడ ఏర్పాటు చేసింది కార్పొరేటర్ల సమావేశం.. నీవేమైనా కార్పొరేటర్ అయితే మాట్లాడు.. ఏదైనా ఉంటే వైసీపీ అధినేత జగన్ వద్ద చెప్పుకో అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే సంవత్సరం మార్చి వరకు మేయర్‌ను దింపే అధికారం ఎవ్వరికి లేదని రామయ్య అన్నారు. టీడీపీ నాయకు లు దించాలని ప్రయత్నిస్తే కోర్టుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని మేయర్ తెలిపారు. అనంతరం ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా ఉండి పార్టీని బలోపేతం చేసుకునే దిశగా ఆలోచించాలన్నారు. కార్పొరేటర్లు, నాయకులు అధికార పార్టీ ప్రలోభాలకు గురికాకుడదని సూచించారు. మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకోవాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపైనే ఉందన్నారు. అనంతరం ఎస్‌బీఐ కూడలిలో దివంగత వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ఆర్ఎస్ కూడలిలో నూతనంగా నిర్మిస్తున్న పార్టీ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు సుజాత, ఎ.క్రాంతికుమార్, సాంబశివుడు, షేక్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల సమస్యలు పరిష్కరిస్తా: ఎమ్మెల్యే బీవీ



ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిని సత్కరిస్తున్న పత్తి ఓబులయ్య తదితరులు

కర్నూలు(కల్చరల్), జూలై 6: జిల్లాలోని నాటక రంగంలోని కళాకారుల సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. శనివారం కర్నూలు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ఆధ్వర్యంలో పలువురు కర్నూలుకు చెందిన నాటక రంగ కళాకారులు ఎమ్మిగనూరుకు వెళ్లి జయనాగేశ్వరరెడ్డిని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లాలో నాటక రంగ కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలు ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తన తండ్రి మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డికి నాటక రంగం అంటే ప్రాణమని, ఆయన ఎక్కడ పౌరాణిక నాటకాలు ఆడుతున్నా అక్కడికి వెళ్లి తెల్లవార్లూ నాటకాలు చూసేవారిని గుర్తు చేసుకున్నారు. అదే అలవాటు తనకు తన తండ్రి ద్వారా వచ్చిందని, నాటక ప్రదర్శనలు ఎక్కడ జరిగినా వెళ్లి చూస్తుంటానని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ రంగస్థల కళాకారులు గాండ్ల లక్ష్మన్న, సంగా ఆంజనేయులు, పీపీ గురుమూర్తి పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుకున్న కర్ణాటక మద్యంతో సెబ్ పోలీసులు

కోడుమూరు (రూరల్), జూలై 6: కోడుమూరు సెబ్ పోలీసులు వేర్వేరు చోట్ల కర్ణాటక మద్యం సీజ్ చేశారు. సెబ్ సీఐ రామాంజనేయులు శనివారం తెలిపిన వివరాల మేరకు సంగాల గ్రామంలో కురువ హరిక్రిష్ణ అనే వ్యక్తి నుంచి 25 ప్యాకెట్లు, చెర్ల కొత్తూరు గ్రామానికి చెందిన రాజేంద్రగౌడ్ నుంచి 95 కర్ణాటక మద్యం ప్యాకెట్లు సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్ఐ అలీబేగ్ సిబ్బంది హనుమంతు, గోపాల్‌నాయక్, వీరు పాక్షిరెడ్డి, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

కుక్కలకు టీకాలు వేయించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో, విద్యార్థులు

కర్నూలు(హాస్పిటల్), జూలై 6: కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు తప్పనిసరిగా వేయించాలని డీఎంహెచ్‌వో వై.ప్రవీణ్‌కుమార్ అన్నారు. వరల్డ్ జూనోసిస్ దినం సందర్భంగా జిల్లా వైద్యఆరోగ్య శాఖ నుంచి కర్నూలు జీజీహెచ్‌వరకు ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జంతువుల నుంచి వచ్చే వ్యాధుల గురించి వాటికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రాథమిక, ఆరోగ్య కేంద్రాల్లో తెలుసుకోవాల న్నారు. వీధుల్లో కుక్కలు కరిచి నప్పుడు పీహెచ్‌సీ, అర్బన్ హెల్త్ సెంటర్లలో వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. డిస్ట్రిక్ట్ సర్వేలెన్స్ ఆఫీసర్ నాగప్రసాద్ మాట్లాడుతూ ప్రతి వీధి కుక్కకు స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ వేయించాలని సూచించారు. కుక్క కాట్ల సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 15400 కాల్ చేసి వివరాలు తెలుసు కోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ హేమలత, హెల్త్ ఎడ్యుకేటర్ పద్మావతి, ఎంపీహెచ్‌ఈవో మోక్షేశ్వర్, వేణుగోపాల్, చలపతి, పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించండి



రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈవో

ఓర్వకల్లు, జూలై 6: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో ఓంకార్ యాదవ్ అన్నారు. శనివారం మండలంలోని లొద్దిపల్లెలోని మండల పరిషత్ పాఠశాల స్పెషల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలను, బైరాపురం ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన తయారీ తదితర వాటిని పరిశీలించారు. 3 నుంచి 10వ తరగతి వర కు విద్యార్థులందరికీ కనీస సామర్థ్యాలు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు ధార్మిక సంస్థల ప్రతినిధుల సమ్మేళనం



కరపత్రాలను విడుదల చేస్తున్న వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, ధార్మిక సంస్థల ప్రతినిధులు

కర్నూలు(కల్చరల్), జూలై 6: పాతనగరంలోని జమ్మిచెట్టు సమీపంలోని లలితాపీఠంలో ధార్మిక సంస్థల ప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం నిర్వహిస్తున్నట్లు లలితాపీఠం వ్యవస్థాపకుడు మేడా సుబ్రహ్మణ్య స్వామి తెలిపారు. శనివారం లలితాపీఠంలో ఈ సమ్మేళనం వివరాలు తెలిపే కరపత్రాలను ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ టి. ప్రతాపరెడ్డిలు హాజరై మాట్లాడారు.

పశువుల్లో గర్భకోశ వ్యాధులను గుర్తించాలి

కల్లూరు, జూలై 6: పశువుల్లో గర్భకోశ వ్యాధులను సకాలంలో గుర్తించి చికిత్స అందించాలని జిల్లా పశుగణాభివృద్ధి సంఘం కార్యనిర్వాహణ అధికారి డాక్టర్ కె.రాజశేఖర్ అన్నారు. శనివారం కల్లూరు మండలం తడకనపల్లె మజరా వామసముద్రంలో సర్పంచు సహరాబీ అధ్యక్షతన పశువులకు ఉచిత గర్భకోశవ్యాధుల చికిత్సా శిబిరం నిర్వహించారు. అనంతరం పశుకేంద్రాన్ని సర్పంచు సహరాబీ ప్రారంభించారు. కార్యక్రమంలో కల్లూరు సహాయ సంచాలకులు పార్థసారధి, పశువైద్యులు రాజశేఖర్, శ్రీకాంత్‌రెడ్డి, దీప్తి తడకనపల్లె మహిళా గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు జుబెదాబీ, టీడీపీ నాయకులు కోటి పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌పూల్ జూబ్లీ వేడుకలు



కమిషనర్‌ను సన్మానిస్తున్న క్రీడా సంఘాల ప్రతినిధులు

కర్నూలు(స్పోర్ట్స్), జూలై 6: నగరంలోని కిసాన్ ఘాట్ వద్దనున్న జిల్లా క్రీడాప్రాధికార సంస్థ స్విమ్మింగ్‌పూల్‌లో శనివారం జూబ్లీ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నగర పాలక కమిషనర్ ఎ.భార్గవ్‌తేజ, సెట్కూరు సీఈవో రమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నిత్యం ఈతను సాధన చేస్తే ఆరోగ్యంగా ఉంటారని, చిన్నా రులు ఈతను నిత్యం సాధన చేసి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి పతకాలు తీసుకుని రావాలని కోరారు. సెట్కూరు సీఈవో మాట్లాడుతూ ఐదు దశాబ్దాల క్రితం దక్షిణాంధ్రలో 50/21 మీటర్ల విస్తీర్ణంలో నిర్మించిన తొలి స్విమ్మింగ్‌పూల్ కర్నూలులో ఏర్పాటైందన్నారు. ఇంతటి చరిత్ర కలిగిన స్విమ్మింగ్‌పూల్ గత ఏడాదిలో సరైన సదుపాయాలు లేక ఇబ్బంది పడున్నామని తెలుసుకుని కమిషనర్ దాదాపు రూ.25లక్షలతో అన్ని సదుపాయాలు కల్పించారన్నారు. అనంతరం స్విమ్మింగ్ పూల్ లైఫ్‌టైమ్ మెంబర్లు కమిషనర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మాస్టర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ రెడ్డి, స్విమ్మింగ్ శిక్షకుడు నటరాజరావు పాల్గొన్నారు.

ఈత కొలనులో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తాం: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలోని ఈత కొలనులో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. శనివారం స్విమ్మింగ్ పూల్ గోల్డెన్ జూబ్లీ సెలెబ్రేషన్స్ కమిటీ ఆధ్వర్యంలో కమిషనర్ భార్గవ్‌తేజ, సీఈవో పీవీ రమణ, డీఎస్ డీవో భూపతిరావులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్విమ్మింగ్ పూల్ గోల్డెన్ జూబ్లీ సందర్భంగా కొన్ని ఆధునీకరణ, అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో నటరాజరావు, సండడి సుధాకర్, రాజశేఖర్‌గౌడు, ఎంఎల్ శ్రీనివాసరెడ్డి, విఠలశెట్టి, లక్ష్మీనారాయణ రెడ్డి, జి.రామకృష్ణ యాదవ్, సర్వేశ్ గౌడు పాల్గొన్నారు.

వ్యవసాయ, విజిలెన్స్ అధికారుల తనిఖీలు

పట్టుబడ్డ అనుమతి లేని మందులు, విత్తనాలు



మందుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

కోడుమూరు, జూలై 6: వ్యవసాయ కమిషనర్ గుంటూరు కార్యాలయం నుంచి ఏడీఏటీ శ్రీనివాసులు, కర్నూలు జిల్లా విజిలెన్స్ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో కోడుమూరు పట్టణంలో శనివారం పలు మందులు, విత్తన దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కిరణ్ హైబ్రిడ్ సీడ్స్ దుకాణంలో రికార్డులను పరిశీలించారు. సుమారు రూ.15.57లక్షలు విలువ గల మందు లకు సరైన దస్త్రాలు లేకపోవడంతో అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 30 రోజుల్లో సరైన దస్త్రాలు చూపించాలని లేకపోతే సరుకును సీజ్ చేసి కోర్టులో హాజరు పరుస్తామని హెచ్చరించారు. అలాగే రాఘవేంద్ర ట్రేడర్స్‌లో కూడా సుమారు రూ.4లక్షలకు పైగా మందులకు సరైన దస్త్రాలు లేకపోవడం వాటి విక్రయాలను నిలిపివేశారు. ఈసందర్భంగా ఏడీఏటీ శ్రీనివాసులు మాట్లాడుతూ తనిఖీ చేసిన దుకాణాల్లో మందులు, విత్తనాలకు సంబంధించిన రికార్డులు లేకుండా విక్రయించడం నేరమన్నారు. కార్యక్రమంలో మండల వ్యవ సాయ అధికారి రవిప్రకాష్ పాల్గొన్నారు.

చెడు అలవాట్లతో క్యాన్సర్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వై.ప్రవీణ్ కుమార్

కర్నూలు(హాస్పిటల్), జూలై 6: చెడు అలవాట్లతో క్యాన్సర్ వ్యాధి వచ్చే అవకాశం ఉందని డీఎంహెచ్‌వో వై.ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం జిల్లా వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కర్నూలు మెడికల్ కాలేజీలోని లెక్చరర్ గ్యాలరీలో జరుగుతున్న క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 30 సంవత్సరాలు పైబడిన వారందరికీ అన్ని రకాల క్యాన్సర్‌లను స్క్రీనింగ్ చేయించాలని ఆదేశించారు. జిల్లా ఎన్‌సీడీ అధికారి హేమలత మాట్లాడుతూ గర్భాశయ ముఖద్వారం, రొమ్ము, నోటి క్యాన్సర్లను ముందుగానే గుర్తించి చికిత్స అందించాలన్నారు. శిక్షణలో డాక్టర్ మంజూషా, డాక్టర్ నిఖిత్ నస్రీన్ (ఓబీజీ), డాక్టర్ తులసిబాయి (డెంటల్), కమ్యూనిటీ మెడిసిన్ వైద్యురాలు రజిత, డాక్టర్ నాగరాజు, ప్రొజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



కల్నల్ జోబీ ఫిలిఫ్‌కు పూలమొక్క అందజేస్తున్న పాఠశాల నిర్వాహకులు

కర్నూలు(కల్చరల్), జూలై 6: విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కర్నూలు ఎన్‌సీసీ బెటాలియన్ అధికారి కల్నల్ జోబీ ఫిలిఫ్ పేర్కొన్నారు. శనివారం నగర శివారులోని ఎడిఫై వరల్డ్ స్కూల్‌లో వివిధ తరగతులకు చెందిన విద్యార్థులను పలు విభాగాలకు నాయకులుగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కల్నల్ జోబీ ఫిలిఫ్ హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ చదువుతోపాటూ వివిధ సామాజిక అంశాలను విద్యార్థులు అధ్యయనం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు డాక్టర్ సతీష్ పోలిశెట్టి, డాక్టర్ మనోజ్‌కుమార్, ప్రిన్సిపాల్ జోసెఫ్ డేవిడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరాటే విజేతలకు టీజీ అభినందన



కరాటే విజేతలతో టీజీ వెంకటేశ్

కర్నూలు(స్పోర్ట్స్), జూలై 6: నేపాల్‌లో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో జిల్లా కరాటే మార్షల్ విజేతగా నిలిచారు. మార్షల్స్ ధ్రువకుమార్, వరప్రసాద్, రేవంత్ కుమార్, రయాన్ బంగారు పతకం సాధించారు. ఇండియా, నేపాల్, భూటాన్, శ్రీలంక మార్షల్స్ కరాటే పోటీల్లో తలపడ్డారు. శనివారం మౌర్యఇన్ కార్యాలయంలో రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ విజేతలను అభినందించారు. కరాటే కోచ్ షకీల్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిని దూషించిన టీడీపీ నాయకులపై కేసు నమోదు

కొలిమిగుండ్ల, జూలై 6: మండలంలోని కోరుమానుపల్లె గ్రామంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిని దూషించిన ఘటనలో ఇద్దరు టీడీపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు బనగానపల్లె సీఐ గోపీనాథ్‌రెడ్డి శనివారం వెల్లడించారు. కోరుమానుపల్లె గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు విజయ్ భాస్కర్‌రెడ్డి, దూదేకుల పెద్ద నడిపి తనను దూషించి, దాడి చేయడానికి ప్రయత్నించారని బాధిత ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మరోవైపు ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా వైరల్ కావడంతో ఎస్సీ కమిషన్ స్పందించింది. సంఘటనపై పూర్తి వివరాలు అందించాలని, నిందితులపై కఠిన చర్యలు చేపట్టాలని ఎస్సీ కార్యాలయాన్ని కోరినట్లు ఎస్సీ సంఘం నాయకులు వెల్లడించారు.

ఇక్కడే పేద పిల్లల ఆశ్రయం

సంక్షేమ హాస్టళ్లు అంటేనే సంక్షోభానికి చిరునామాలుగా మారాయి. తల్లిదండ్రులకు, స్వగ్రామాలకు దూరంగా ఉంటూ ఈ పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన వందలాది మంది విద్యార్థులు అరకొర వసుతల మధ్య ఏ మాత్రం ఆహ్లాదకరంకాని వాతావరణంలో ఆశ్రయం పొందుతూ చదువులు కొనసాగిస్తున్నారు. భావి భారత పౌరులైన ఈ విద్యార్థులు సంక్షోభ గృహాల్లో చిక్కుకుపోయి విలవిలలాడుతున్నారు. కొత్తగా కొలువైన ఈ ప్రభుత్వమైనా తమ గోడు ఆలకిస్తుందా అని పేద విద్యార్థులు ఆశగా ఎదురు చూస్తున్నారు..

- శిథిల భవనాలకు మోక్షమెప్పుడో?
- ఏడేళ్లుగా అద్దెభవనాల్లోనే హాస్టళ్లు
- వసతి లేక ఎస్సీ విద్యార్థుల వేదన
- కొత్తప్రభుత్వంపైనే ఆశలు

ఎమ్మిగనూరు, జూలై 6: ఎమ్మిగనూరులో ఉన్న ప్రభుత్వ సాంఘీక సంక్షేమ వసతిగృహాల భవనాలు శిథిలమయ్యాయి. కొన్నేళ్ల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వం హాస్టల్ భవనాలను నిర్మించారు. ఇవి శిథిలమై ఏడేళ్లు గడుస్తోంది. ఇప్పుడు అరకొర వసతుల మధ్య అద్దె భవనాల్లో ఉంటున్నారు.

● **శిథిలమైన హాస్టల్ భవనాలు :** పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో 1990లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, బీసీ, అనాథ బాలుర హాస్టళ్లకు స్థలాలు కేటాయించి భవనాలు నిర్మించారు. అలాగే పట్టణంలో మరో చోట ఇంద్రానగర్‌లో జడ్పీ బాలికల పాఠశాల వెనుక బాలికల ఎస్సీ హాస్టల్‌కు భవనం నిర్మించారు. ఈ భవనాల్లోనే ఏడేళ్లక్రితం వరకు నడిచాయి. ఈ భవనాలు మొత్తంగా శిథిలమైనా వీటిని మరమ్మతులు చేసేందుకు ప్రభుత్వాలు చొరవ చూపకపోవడంతో విద్యార్థులు కొంతకాలంపాటు భయంభయంగా అక్కడే వసతిపొందారు. ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయేమోనని ఆందోళనతో అధికారులు ఈ హాస్టళ్లను అద్దెభవనాల్లోకి మార్చారు.

● **అద్దెభవనాల్లో వసతులు అంతంత మాత్రమే :** పట్టణంలో కొనసాగుతున్న బీసీ బాలుర, బాలికల హాస్టళ్లలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. అద్దెభవనాలు కావటంతో ఉన్నవాటితోనే విద్యార్థులు సర్దుకుపోతున్నారు. బీసీ ప్రీమెట్రిక్, పోస్టు మెట్రిక్ హాస్టళ్ల పట్టణంలోని గుడికల్ రోడ్డులో వివిధ రెండు కాంప్లెక్స్‌లో కొనసాగుతున్నాయి. ఈ రెండు హాస్టళ్లలో దాదాపు 180మందికి పైగా విద్యార్థులు వసతి పొందుతున్నారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. అలాగే పట్టణంలో గీతానగర్‌లో ఉన్న రెండు బాలికల వసతి గృహాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఇక్కడ కూడా ఒక హాలుతో పాటు ఇరుకు గదులు, బాత్‌రూంలు ఉన్నాయి. ఈ హాస్టళ్లలో దాదాపు240 మందికి పైగా బాలికలు గత ఏడాది వసతి పొందారు. ఈ ఏడాది ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. అలాగే గోనేగండ్ల రోడ్డు, సున్నంబట్టి మసీదు ప్రాంతంలో ఉన్న రెండు బీసీమహిళల, బీసీ బాలుర వసతి గృహాలు ప్రైవేటు భవనాల్లో కొనసాగుతున్నాయి. పేదకుటుంబాలకు చెందిన బాల,బాలికలు ఈ అద్దెభవనాల్లో ఉండటం వల్ల వారి చదువ ప్రశాంతంగా కొనసాగేపరిస్థితి కనిపించటం లేదు. విశాలమైన గదులు, ప్రహరీలు లేకపోవటం, ఆటస్థలం లేకపోవటంతో ఇక్కడ విద్యార్థులకు ఏ మాత్రం ఆహ్లాదకరమైన వాతావరణం కనిపించడం లేదని విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చెందుతున్నారు.


ఇంద్రానగర్‌లో శిథిలమైన ఎస్సీ బాలికల హాస్టల్ భవనం

● **ఎమ్మిగనూరులో ఏర్పాటుకు నోచుకోని ఎస్సీ హాస్టల్ :** ఎమ్మిగనూరు పట్టణంలో గతంలో ఎస్సీ బాలికల, ఎస్సీ బాలుర హాస్టళ్లు ఉండేవి. వాటిలో మూడు వందల మందికి పైగా బాల,బాలికలు మూడో తరగతినుంచి పదో తరగతి వరకు వసతి పొందుతూ చదువుకునేవారు. అయితే అప్పటి ప్రభుత్వం కొన్ని హాస్టళ్లను పూలింగ్ కేంద్రాల పేరుతో ఇతర ప్రాంతాల్లోని హాస్టళ్లలోకి కలిపేయటంతో ఎమ్మిగనూరులో ఎస్సీ హాస్టళ్లు లేకుండా పోయాయి. దీంతో ఆ సామాజిక వర్గానికి చెందిన బాల,బాలికలు హాస్టళ్లలో చేరేందుకు ఇబ్బంది పడుతున్నారు. గోనేగండ్ల, నందవరం మండలాల్లో చేర్పించాలనుకుంటే అక్కడ కూడా ఇంటిగ్రేటేడ్, బీసీ బాలికల హాస్టళ్లు కావడంతో ఎస్సీ బాల,బాలికలకు ఐదు మందికి మించి సీట్లు దొరకని పరిస్థితి. దీంతో ఎమ్మిగనూరులోని మూడు మండలాలనుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువు దీరింది. శిథిలభవనాలకు ఇప్పుడైనా మోక్షం లభిస్తుందా అని విద్యార్థులు.. విద్యార్థి సంఘాల నాయకులు ఎదురు చూస్తున్నారు. కొత్తప్రభుత్వమైన హాస్టళ్ల భవనాలను నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఎమ్మిగనూరు ఎన్టీఆర్ కాలనీలో శిథిలమైన ప్రభుత్వ బీసీ, ఎస్సీ వసతి గృహాల భవనాలు.......



గుడికల్ రోడ్డులో అద్దెభవనంలో కొనసాగుతున్న బీసీ బాలుర హాస్టల్

తాగునీటి సమస్యపై స్పందించిన పత్తిపాడు ఎమ్మెల్యే

● సమస్యను పరిష్కరించాలని కర్నూలు కలెక్టర్‌కు ఫోన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆలూరు, జూలై 6: ఆలూరు పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యపై ఆలూరుకు చెందిన గుంటూరు జిల్లా పత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు స్పందించారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన ఆలూరులో తాగునీరు బంద్.. 16 రోజులుగా నిలచిన సరఫరా అనే కథనంపై ఆరా తీశారు... కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాకు ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు. నీటి సమస్య తలెత్తకుండా అధికారులను అప్రమత్తం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రతినిధితో ఫోన్‌లో మాట్లాడారు. 16రోజులకు ఒకసారైనా నీరు సక్రమంగా సరఫరా కాకపోతే సర్పంచ్, అధికారులు ఎంచేస్తున్నారన్నారు.. ఈ సమస్య సీఎం దృష్టికి కూడా వెళ్లిందని పేర్కొన్నారు.

గోనెగండ్లలో విజిలెన్స్ అధికారుల తనిఖీ

గోనెగండ్ల, జూలై 6: గోనెగండ్లలో శనివారం విజిలెన్స్ అధికారులు ఎరువుల దుకాణాలను అకస్మీకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణ జిల్లా గన్నవరంకు చెందిన ఏడీఏ శ్రీనివాసరావు మాట్లాడుతూ మల్లికార్జున ట్రేడర్స్ లో రూ 1,33,650, లక్ష్మీ నరసింహ ట్రేడర్స్‌లో రూ 16, 96, 320, జైకిసాన్‌లో రూ 3, 96,950 మొత్తం 46. 10 కేజీలు వివిధ రకాల విత్తనాలను అమ్మకాలు నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. వీటి విలువ మొత్తం రూ 22,28, 870 అని పేర్కొన్నారు.

నీటి కోసం పంచాయతీ కార్యాలయం ముట్టడి


పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మహిళలు

మద్దికెర, జూలై 6: గుక్కెడు నీటి కోసం నెలరోజులుగా తల్లడిల్లుతున్నా పంచాయతీ అధికారుల్లో చలనం లేకపోవడంతో ఆగ్రహించిన మహిళలు పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించారు. శనివారం స్థానిక రామ్‌నగర్ కాలనీకి చెందిన మహిళలు పంచాయతీ కార్యాలయ అధికారులతో వాగ్వాదానికి దిగారు. జూనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్ సరైన సమాధానం ఇవ్వకపోవడంతో ఆగ్రహించిన మహిళలు అక్కడే బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'నెలరోజులుగా నీరు సరఫరా అస్తవ్యస్తంగా ఉన్నా పట్టించుకోవడం లేదు. ఈ సమస్యపై కలెక్టర్ రంజిత్‌బాషాకు స్పందనలో వినతి పత్రం అందజేం. అయినా, పంచాయతీ వారు మాత్రం చర్యలు తీసుకోవడం లేదు.. ఇంకెన్ని రోజులు ఇలా నీటి కోసం తహతహలాడాలి'అంటూ మహిళలు అధికారుల నిర్లక్ష్య ధోరణిపై మండిపడ్డారు. సకాలంలో నీటి పన్నులు చెల్లిస్తున్నా ఎందుకు నీరు సరఫరా చేయడం లేదని నిలదీశారు. రూ.6వేలు డిపాజిట్ చెల్లించి నెలకు రూ.100 చెల్లిస్తున్నా.. నీరు వదలకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఈ విషయంపై పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి మద్దిలేటి స్వామి మాట్లాడుతూ రెండు మూడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

ఆలయంలో చోరి

దేవనకొండ ,జూలై 6 : కప్పట్రాళ్ల రిజార్వు ఫారెస్టులో వెలసిన కౌలుట్ల చెన్నకేశవ స్వామి ఆలయంలో చోరి జరిగింది. ఆలయంలో ఎవ్వరూలేని సమయంలో దుండగులు బీరువా తెరచి అందులో ఉన్న దాదాపు రూ.4 వేల నగదు చోరి చేసిన్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. చోరి జరిగిన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

ఆలూరు అభివృద్ధికి సహకరించండి


కలెక్టర్ రంజిత్ బాషాను కలసిన టీడీపీ నేత వీరభద్ర గౌడ్

ఆలూరు, జూలై 6: వెనుకబడిన ఆలూరు నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని ఆలూరు టీడీపీ సీనియర్ నేత వీరభద్ర గౌడ్ కలెక్టర్ రంజిత్ బాషాను కోరారు. శనివారం కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలసి నియోజకవర్గ సమస్యలను ప్రస్తా వించారు. తాగు నీటి సమస్య పరిష్కారం కోసం నిధులు కేటాయించాలని, రహ దారులు అధ్వాన్నంగా ఉన్నాయని వాటినిన బాగు చేయించేందుకు అధి కారులుకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే బీవీ


కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, జూలై 6: కలెక్టర్ రంజీత్ బాషాను శనివారం ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛమిచ్చి శుభా కాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మిగనూరు నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై చర్చించారు.

ఏటీఎం కేంద్రాన్ని మరమ్మతులు చేయాలి

తుగ్గలి, జూలై 6: స్టేట్ బ్యాంకు వద్ద ఉన్న ఏటీఎం పని చేయడం లేదని, మరమ్మతులు చేయించి రీ ఓపెన్ చేయాలని సీపీఎం నాయకులు రంగరాజు కోరారు. శనివారం పెండేకల్ ఆర్ఎస్ స్టేట్ బ్యాంకు మేనేజర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఏటీఎం మిషన్‌గత మూడు నెలల నుంచి పని చేయకపోవడంతో నగదును డ్రా చేసుకోవడానికి ఖాతాదారులు, ముఖ్యంగా రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే మరమ్మతులు చేయించి అందుబాటులోకి తేవాలని కోరారు. అలాగే బ్యాంకులో ప్రింటింగ్ మిషన్, మంచినీటి సౌకర్యం, రైతులు తీసుకున్న వివరాలను బ్యాంకు బుక్‌లో పొందుపరచాలని కోరారు. నాయకులు రంగస్వామి, గోపాల్ ఉన్నారు.

రామ్‌జల చెరువు నీటిని త్వరలో అందిస్తాం

● మునిసిపల్ కమిషనర్

ఆదోని టౌన్, జూలై 6: అనేక సంవత్సరాలుగా పట్టణ ప్రజలకు తాగునీటిని అందిస్తున్న రామ్‌జల చెరువు నీటిని ప్రజలకు తిరిగి అందించడం కోసం చర్యలు చేపట్టినట్లు మునిసిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన సిబ్బందితో కలిసి రామ్‌జల చెరువును. పరిశీలించారు. రెండేళ్ల క్రితం చెరువు సమీపంలో జరిగిన దేవర సందర్భంగా చెరువులోని నీటిని తాగిన కారణంగా ఒకరు చనిపోయినట్లు ఆరోపణలు రావడంతో అప్పటినుండి చెరువు నీటిని ప్రజలకు సరఫరా చేయడం నిలిపివేశారని, అనంతరం జరిపిన పరీక్షలలో అవి కేవలం వదంతులు మాత్రమే అని తేలడంతో, చెరువులో చాలా కాలంగా నిలువ ఉన్న నీటిని ప్రస్తుతం బయటికి తోడేస్తున్నామని తెలిపారు. రానున్న వర్షాలలో చెరువును నీటితో నింపుకొని ఫిల్టర్ చేసి ప్రజలకు అందిస్తామని పేర్కొన్నారు. వర్షం నీరు చెరువులోకి చేరడానికి క్యాచ్‌మెంట్ ఏరియాలోని అడ్డంకులను తొలగించి, చెరువు నీరు అపరిశుభ్రం కాకుండా చుట్టూ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. మునిసిపల్ ఇంజనీర్ వెంకటాచలపతి, ఏఇ రాజశేఖర్ రెడ్డి ఉన్నారు.

జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి

డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను కొనసాగిస్తామని తెలుగుదేశం పార్టీ, దళిత, గిరిజన, ఎమ్మార్పీఎస్, ప్రజా సంఘాల నాయకులు ప్రతినబూనారు. బాబు జగ్జీవన్ రామ్ 38వ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం జిల్లా వ్యాప్తంగా ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలువేసి ఘన నివాళి అర్పించారు. భారత దేశ మాజీ ఉపప్రధానిగా దళితుల సంక్షేమానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. దళితులు అభ్యున్నతికోసం అహర్నిషలు శ్రమించి, హక్కులకోసం పోరాడిన గొప్ప యోదుడు డాక్టర్ జగ్జీవన్ రామ్ అని నివాళి అర్పించారు. - (ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)


మంత్రాలయంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

10న కార్మికుల డిమాండ్స్ డే

ఎమ్మిగనూరు టౌన్, జూలై 6 : జూలై 10న కార్మికుల డిమాండ్స్ డే ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు, జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజినేయులు పిలుపునిచ్చారు. పట్టణంలో స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను బీజేపీ ప్రభుత్వం 2020లో రద్దుచేసిందని మళ్లీ కొత్తగా నాలుగు లెబర్ కోడ్‌ల ద్వారా కార్మికులను నష్టపరిచే విధంగా అమలు చేయడానికి ప్రయత్నాలు చేస్తోందని, తక్షణమే వీటిని రద్దు చేయాలని కోరారు.

'నా భూమిని కబ్జా చేశారు'

ఆదోని రూరల్, జూలై 6 : తన పేరు మీద ఉన్న 0.95 ఎకరాల భూమిని కబ్జాచేసిన మల్లమ్మగారి ఈరన్నపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని రైతు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన కొనసాగించారు. తన పేరు మీద ఉన్న భూమిని సాయిప్రసాద్‌రెడ్డి అనుచరుడుగా చెలామణి అయిన సలకలకొండకు చెందిన మల్లమ్మ గారి ఈరన్న 0.95 ఎకరాలకు 2018లో దొంగ అగ్రిమెంట్ పుట్టించారని, ఇప్పుడు రిజిస్ట్రేషన్ చేసేందుకు యత్నిస్తున్నాడని అతనిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరారు.

ఫర్టిలైజర్స్ దుకాణాలు తనిఖీ

● రూ.2.48లక్షల ఎరువుల అమ్మకాలు నిలిపివేత

ఆలూరు, జూలై 6: ఆలూరు పట్టణంలోని పలు ఎరువుల, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్సమెంట్ డీ చంద్రశేఖర్ రెడ్డి పలు ఎరువులు, ఫర్టిలైజర్స్ దుకాణాలలో శనివారం తనిఖీలు చేశారు. అమ్మకాలు, స్టాక్ రిజిస్టర్‌లు తనిఖీ చేశారు. రాధ స్వామి ఫర్టిలైజర్స్ రూ.2.48లక్షలకు సంబంధించిన నీటిలో కరిగే ఎరువులు అమ్మకాల రికార్డులు చూపనందున అమ్మకాలు నిలుపుదల చేసినట్లు ఆలూరు ఏడీఏ సునీత తెలిపారు. ఈ తనిఖీలో పల్నాడు జిల్లా ఏడీఏ హనుమత్ రావ్, ఏవో వేంకటేశ్వర గౌడ్ పాల్గొన్నారు.

పోలీసు లాంఛనాలతో హెడ్‌కానిస్టేబుల్ అంత్యక్రియలు

మంత్రాలయం, జూలై 6: మంత్రాలయం హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న సాతర్ల రమేష్ అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం ఆదోనిలో మంత్రాలయం ఎస్ఐ గోపీనాథ్ ఆధ్వర్యంలో అధికార లాంఛనాలతో తుపాకులతో గాల్లో పేల్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన లేని లోటు తీరనిది అని, ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సాయంకు చర్యలు తీసుకుంటామని కుటుంబానికి భరోసా ఇచ్చారు.

దేవాలయ అభివృద్ధికి సహకరించండి



మద్దికెర, జూలై 6: మండలంలోని పెరవలి గ్రామంలో ఎంతో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథ స్వామి దేవాలయ అభివృద్ధికి సహకరించాలని మాజీ జడ్పీటీసీ సభ్యులు పి.పురుషోత్తం చౌదరి ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును కోరారు. శనివారం రంగనాథ స్వామి ఆలయ ఈవో చంద్రశేఖర్ రెడ్డి తో కలిసి ఎమ్మెల్యేను శాలువతో సన్మానించి రంగనాథ స్వామి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయంలో అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు. దేవాలయ అభివృద్ధికి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే కేఈ అన్నారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు రంగస్వామి, మాజీ ఆలయ చైర్మన్ అంజనేయులు, సిబ్బంది రఘు తదితరులు పాల్గొన్నారు.

కూలి రేట్ల పెంపుపై చర్చలు సఫలం

ఆదోని (అగ్రికల్చర్), జూలై 6: పట్టణంలోని ఎరువులు విత్తన దుకాణ యజమానులకు పనిచేసే హమాలి కూలి రేట్ల పెంపుపై శనివారం జరిగిన చర్చలు సఫలమయ్యాయి. ఫర్టిలైజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్‌నంద రెడ్డి, సందీప్ రెడ్డి, ఆదిత్య, ఉదయ్, లక్ష్మీ గణేష్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్ బాబు పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకన్న కల్లుబావి రాజు, నాగరాజు చర్చలు జరిపారు ప్రతి రెండేళ్లకి ఒకసారి పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా హమాలీలకు కూలీ రేట్లు పెంచాలని కోరారు. యజమానులు ప్రస్తుత పరిస్థితుల్లో పెంచలేమని గతవారం కిందట చెప్పడంతో సమ్మె నోటీసు అందజేశారు. ఎట్టకేలకు కూలీరెట్ల పెంపకం అంగీకరించడంతో హమాలీలు హర్షం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

55వ సారి రక్తదానం చేసిన కాంగ్రెస్ నేత

ఆదోని టౌన్, జూలై 6: కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దిలీప్ దోక 55వ సారి అరుదుగా లభించే ఏ గ్రూప్ రక్తదానం చేసి నాలుగు నెలల గర్భిణీ మహిళ ప్రాణాలను కాపాడారు. యాటకల్లు గ్రామానికి చెందిన నాలుగు నెలల గర్భిణీ రక్తహీనత కారణంగా ప్రమాదంలో ఉండటాన్ని గమనించిన కాంగ్రెస్ నియోజక వర్గ ఇన్‌చార్జ్ రమేష్ యాదవ్ తమ పార్టీకి చెందిన జిల్లా ఉపాధ్యక్షుడు దిలీప్ ధోకాను సంప్రదించి రక్తదానం చేయించారు. ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడిన కాంగ్రెస్ నాయకులను గ్రామస్థులకు అభినందించారు.

డీఐజీ కళ్యాని ఆకస్మిక తనిఖీ

ఆస్పరి, జూలై 6: ఆస్పరి సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని శనివారం డీఐజీ కళ్యాని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయ రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యాలయంలోకి ప్రవేటు వ్యక్తులను, మధ్య దళారులను అనుమతించవద్దని సబ్ రిజిస్టర్ జగదీష్ వర్మను ఆదేశించారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే వీరుపాక్షి

చిప్పగిరి, జూలై 6: నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేస్తానని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. శనివారం దౌల్తాపురం గ్రామంలో నాయకుడు శేఖన్నకు రూ.50వేల చెక్కును అందజేశారు. ఎమ్మెల్యేగా తనను గెలిపించిన ప్రజల ఆకాంక్ష మేరకు నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు నిధులు తెచ్చి కృషి చేస్తానని పేర్కొన్నారు. వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు నారాయణమ్మ, మండల కన్వీనర్ మారయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకే పరీక్షలు

మద్దికెర, జూలై 6: ప్రతి విద్యార్థినీ, విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికి తీసేందుకే టాలెంట్ టెస్టు నిర్వహిస్తారని మాజీ సర్పంచు కొత్తపేట వెంకటేశ్వరరెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఫ్రెండ్స్ విద్యానికేతన్‌లో ప్లాస్టిక్ వాడకంపైన విద్యార్థులకు ప్లాస్టిక్ నిషేదంపై టాలెంట్ పరీక్ష నిర్వహించారు. అనంతరం పోటీ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు స్థానిక శ్రీసాయి భారత్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బహుమతులు ప్రదానం చేశారు.

సంక్షిప్త సమాచారం

ఉచిత ఇసుక పాలసీ హర్షణీయం

మద్దికెర, జూలై 6: ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం ఉచిత ఇసుక పాలసీని అమలు చేయడం హర్షణీయమని మాజీ జడ్పీటీసీ సభ్యులు జమేదార్ రాజన్న యాదవ్, తాలుకా తెలుగు యువత అధ్యక్షులు ఈడిగ చంద్రశేఖర్‌గౌడు, జిల్లా టీడీపీ సాధికారత కన్వీనర్ ఎస్.లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇసుక పాలసీని రద్దు చేయడం వల్ల చాలా మంది భవన నిర్మాణ కార్మికులు పనులు కోల్పోయారన్నారు. మళ్లీ ఉచిత ఇసుక పాలసీ అమలు చేయడం వల్ల కార్మికులకు ఉపాధి కలగడమే కాకుండా గృహ నిర్మాణదారులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో మండల తెలుగు యువత అధ్యక్షులు ఉదయ్ కుమార్, టీడీపీ నాయకులు టైలర్ హరి, మంగపు రాముడు, గుడి ఎల్లప్ప, తదితరులు ఉన్నారు.

ఘనంగా శ్యాంప్రసాద్ ముఖర్జి జయంతి

పత్తికొండ టౌన్, జూలై 6: పట్టణంలో శనివారం డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జి జయంతిని బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక శాంతినికేతన్ ట్యూటోరియల్‌లో ఆయన చిత్రపటానికి బీజేపీ కిసాన్‌మోర్చా అసెంబ్లీ ఇన్‌ఛార్జి సీసీ రంగన్న పూలమాలలు వేసి నివాళి అర్పించారు. 1951లో జన్‌సంఘ్ పార్టీని ఏర్పాటు చేశారని, బీజేపీ మూలపురుషుడు శ్యాంప్రసాద్ ముఖర్జి అని కొనియాడారు. బీజేపీ మండల అధ్యక్షులు కొత్తపల్లి శంకరయ్య, బీజేపీ లీగల్ సెల్ కన్వీనర్ భాస్కర్, కిసాన్‌మోర్చా సురేంద్ర పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే పరీక్షలు

మద్దికెర, జూలై 6: విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికి తీసేందుకే టాలెంట్ టెస్టు నిర్వహించడం జరుగుతుందని మాజీ సర్పంచ్ కొత్తపేట వెంకటేశ్వరరెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఫ్రెండ్స్ విద్యానికేతన్‌లో ప్లాస్టిక్ వాడకంపైన విద్యార్థులకు ప్లాస్టిక్ నిషేదంపై టాలెంట్ పరీక్ష నిర్వహించారు. అనంతరం పోటీ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు స్థానిక శ్రీసాయి భారత్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ విద్యానికేతన్ కరస్పాండెంట్ ఎర్రవల్లి రామాంజులు, ఉపాధ్యాయులు పెద్దకోట్ల రమేష్, గోవిందు ఉన్నారు.

ప్రజలకు ఉత్తమ సేవలందించాలి

తుగ్గలి, జూలై 6: మండలంలోని అన్ని శాఖల అధికారులు సక్రమంగా పని చేసి ప్రజలకు ఉత్తమ సేవలందించాలని టీడీపీ మండల అధ్యక్ష ఉపాధ్యక్షులు తిరుపాల్‌నాయుడు, వెంకట్రాముడు చౌదరి కోరారు. శనివారం మండల కేంద్రమైన తుగ్గలిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అధికారులు ఎలా పని చేశారో తెలియదని, టీడీపీ ప్రభుత్వంలో మాత్రం అర్హులకు అన్ని పథకాలు అందేలా పని చేయాలన్నారు. అవినీతికి పాల్పడితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి, ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు.